ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహా, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | మంగళవారం | 07.07.2026 | సంపుటి : 2 | సంచిక : 06 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు

కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది

బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క



మహబూబాబాద్, జూలై 6 : కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో -మిగతా 2 లో..



## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

పట్టణ ప్రాంతం కలెక్టర్లు శ్రద్ధవహించాలి

బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి

కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి 02

## హైడ్రా దూకుడుతో పేదలకు నష్టం

పేదల ఇళ్లు కూలగొట్టి పెద్దలకు కట్టబెట్టే పన్నాగం

సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



హైదరాబాద్, జూలై 6 : హైదరాబాద్‌లో హైడ్రా వ్యవహరిస్తున్న తీరు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని ప్రజలు అంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడంలో ఉన్న క్లారిటీ ప్రజలకు లేదని, అమెరికా గడ్డపై నిలబడి ఆయన -మిగతా 2 లో..



## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి

మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ

ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు

పర్యాటకంపై సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 6 : తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర -మిగతా 2 లో..

## కాళేశ్వరంపై పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోండి

లక్ష కోట్లు ఎలా, ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి?

పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి?

కేసీఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు.



సిద్దిపేట, జూలై 6 : కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని -మిగతా 2 లో..



## ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ

గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్

ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు

ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. 03



## బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 6 : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని కోర్టులో పేట్ బషీరాబాద్ పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశాక ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో అభియోగాలను సవరించినట్లు -మిగతా 2 లో..



## అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

దేశానికి బిజెపి క్షమాపణలు చెప్పాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

అయోధ్య విరాళాల చోరీపై బిజెపి దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట, జూలై 6 : శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిర విరాళారం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, -మిగతా 2 లో..

## జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి

కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు

ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు

టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులు సమాంతరంగా పూర్తి

మూడింతలు పెంచిన సిబ్బంది... ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ ?2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు.

హైదరాబాద్, జూలై 6 : ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి -మిగతా 2 లో..



## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

## అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)

యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణం జరగాలనీ శిలాన్యాసం రాజీవ్ గాంధీ గారు వేశారు..అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు ప్రధాని మోడీ, అమిత్ షా,ముఖ్యమంత్రి గారికి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదన్నారు. హుండీలు కొల్లగొట్టారు..రాముని పేరు మీద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు.. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. మీకు రామునికి వ్యతిరేకం కాదు..మేము శ్రీరాముడి కళ్యాణంలో పాల్గొంటాం..ఇల్లంతకుంట రామాలయంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన బోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుంది..రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలని పొన్నం అన్నారు. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి..రామ జన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్ములు దొంగిలించడంపై హిందువులు అందరికీ అవమానం..దేవుడి పేరు మీద జరిగిన స్కాం.. దేవుడి స్కాం కి వాడుకున్న పార్టీ బీజేపీ అన్నారు. మజ్లిస్ పేరు తీయంది కిషన్ రెడ్డి బతకడు..కిషన్ రెడ్డి గెలవాలంటే మజ్లిస్ ను తిట్టాలి ఇది వారి రాజకీయాలు అంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఓటరు సవరణ ప్రక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది..ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి.. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం.. హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బతిస పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది..ఓటరు సవరణ ప్రక్రియ విజయవంతంగా జరగాలని అన్నారు.

## బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం చేసుకుని, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బండి భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రి కాబట్టి కేసుపై ప్రభావం చూపుతోందని బాధితురాలి తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు దశలో బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఇంకా ఈ కేసులో సాక్షులను విచారణ చేయాల్సి ఉందని.. బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బండి భగీరథ్ జైల్లో ఉన్నప్పుడే కేసు విచారణ పారదర్శకంగా జరుగుతుందని కోర్టులో బాధితురాలి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.



### ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

## నేటితో పూర్తి కావాలి

- పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధ వహించాలి
- బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి
- కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్,జూలై6 :** ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఓ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంపై పాపాన్ని

# అసెంబ్లీ సాక్షిగా కడుక్కోండి

(మొదటిపేజీ తరువాయి)

హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా



కడుక్కోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

### జూన్ 2028 నాటికి

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఎ÷–లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్,



పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంను

## కూలేశ్వరం చేసింది ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

### సిఐ నాగరాజుకు షరతులుపై విచారణ

**విజయవాడ,జూలై6 :** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తు ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమర్థతను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు. అలాగే నిందితుడు నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సముచితమని పేర్కొన్నారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై రేపు(మంగళవారం) ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసు ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బహ్రాయిన్‌లో నిజామాబాద్ వాసి మృతి

### బీచ్‌లో ప్రమాదవశాత్తు దుర్మరణం

**నిజామాబాద్,జూలై6 :** బహ్రెయిన్‌లో విషాదం నెలకొంది. దుర్రత్ అల్ బహ్రెయిన్ సముద్ర తీరంలో నీటిలో మునిగి తెలంగాణ వాసి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట శ్రీనివాస్‌గా గుర్తించారు. అతను బహ్రెయిన్‌లోని ఏఎంసీ సంస్థలో ప్రాజెక్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్‌గా 2019 నవంబర్ 26వ తేదీ నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తాజాగా సముద్ర తీరానికి వెళ్లిన అతను ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న బ్రహెయిన్ కోస్ట్‌గార్డు బృందాలు ఘటనాస్థలికి చేరుకు సహాయక చర్యలు చేపట్టాయి. కానీ లాభం లేకుండాపోయింది. తోట శ్రీనివాస్ మృతిపై ఏఎంసీ సంస్థ యాజమాన్యం సంతాపం ప్రకటించింది. అతని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

### గురుకులాల్లో నాణ్యమైన భోజనం కరువు : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, జూలై 6 :** కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన అందించారని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అన్నారు. వాటిని ఇప్పుడు అధ్వాన్నంగా మార్చారని అన్నారు. నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డల చదువుకు , భద్రతకు నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కంపౌండ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫాక్స్ చైర్మన్ కొడప హన్ను పటేల్, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజులాల, అధికారులు పాల్గొన్నారు.

### హైడ్రా దూకుడుతో

## పేదలకు నష్టం

(మొదటిపేజీ తరువాయి)



అబద్దాలు చెబితేనే జనం నమ్ముతారనే భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. దానికి పరాకాష్టగా తాను హిట్లర్ నుంచి 'హైడ్రా' అనే పదాన్ని తీసుకున్నానని సీఎం స్వయంగా ఒప్పుకున్నారని, దీన్నిబట్టే ఆయన నైజం ఏంటో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల జాగాలిచ్చి ఆదుకుంటే, రేవంత్ రెడ్డి మాత్రం పేదవాడి ఇళ్లను కూలగొట్టి, ఆ స్థలాలను పెద్దవాళ్లకు అంటగట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని, ఇలాంటి హిట్లర్ వారసత్వ సంస్థతో ప్రజలకు న్యాయం జరుగుతుందనుకోవడం భ్రమ అని దుయ్యబట్టారు. తాను మొదట్లో ఒంటరిగా నాలుగు నెలల పాటు హైడ్రాకు వ్యతిరేకంగా పోరాడినప్పుడు చాలామంది ప్రశ్నించారని, కానీ ఇప్పుడు హైడ్రా నిజస్వరూపం ఏంటో అందరికీ తెలిసిందని, చివరకు న్యాయస్థానాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కనబెట్టి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు ఏ చట్టాలతో, కోర్టులతో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శని, ఆదివారాలు చూసుకుని ఇళ్లను ధ్వంసం చేయడంపై కోర్టు సైతం తీవ్రంగా మందలించిందని.. 'నీకు చట్టమంటే గౌరవం లేదా? నువ్వు చట్ట పరిధిలోకి రావా? జాగ్రత్తగా ఉండకపోతే జైల్లో పెడతాం' అని హెచ్చరించినా ఆయన తీరు మార్చుకోవడం లేదని, ఇలాగే మ–న్ముందు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అస్మత్‌పేటలో ఇల్లు కూల్చివేతతో ఒక మహిళ ఏడ్చిన విధానం హైదరాబాదు బస్తీల్లో ఉన్న ప్రతి పేదవాడి ఆవేదనకు అద్దం పడుతోందని, వీరందరికీ తెలంగాణలోని పేదల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో సాగుతున్న ఈ డ్రామాలకు, రేవంత్ రెడ్డి అహంకారానికి రాబోయే మున్సిపల్, జీహెచ్ఎంసీ (ఉఊఓఅ) ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఈటల రాజేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు. పేదవాడి గూడును చెడగొట్టి కూల్చివేతల రాజకీయం చేస్తున్న రేవంత్ రెడ్డి అరాచక పాలనకు అంతం దగ్గర పడిందని, ప్రజల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు.

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ**
**గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్**
**ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు**



**న్యూఢిల్లీ, జూలై 6 :** ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో–పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా–ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్‌లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.



## బిజెపి కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

**ఘనంగా నివాళి అర్పించిన నేతలు రాంచంద్రరావు, దత్తాత్రేయ**
**కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ రాంచంద్రరావు**

**హైదరాబాద్,జూలై6 :** జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం డ్యాం భద్రతపై జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకుని భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రాంచందర్ రావు, ఆ అవినీతి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై నామమాత్ర చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేపడుతుందని రాంచందర్ రావు అన్నారు.

## ముఖర్జీ సేవలు నిరుపమానం

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**
**హైడ్రా తీరుపై మరోమారు ఆగ్రహం**



**హైదరాబాద్, జూలై 6 :** శ్యామప్రసాద్ జయంతి, దలైలామా జన్మదినం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ముఖర్జీ సేవలను ఆయన కొనియాడారు. అలాగే దలైలామా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలలని ఆకాంక్షించారు. దలైలామాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న పక్షపాత పాలనకు హైడ్రా చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇళ్లు, నిర్మాణాల విషయంలో మాత్రం మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా బుల్డోజర్లతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ కుటుంబానికి చెందిన బారిష్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఈ క్యాంపస్ నిర్మించారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని, ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరు మారలేదన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి కోర్టు వివరాలు కోరినా, సామాన్యులపై చూపించే తొందరపాటును ఫాతిమా కాలేజీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌ను యావత్ ముస్లిం సమాజానికి ఏకైక ప్రతినిధిగా భావిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. హైడ్రా చర్యల వల్ల ఎంతోమంది పేద ముస్లింల ఇళ్లు కూలిపోయి, వారి జీవనోపాధి దెబ్బతిన్నప్పుడు మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. ఒవైసీ సోదరుల సొంత ఆస్తుల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే తాటిపైకి వస్తున్నాయన్నారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లతో విధ్వంసం సృష్టించి, కాంగ్రెస్–మజ్లిస్ రాజకీయ బంధం కోసం పెద్దల ఆస్తులకు నిరంతర రక్షణ కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతగా మారిందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ 'ఒకే చట్టం, ఒకే న్యాయం' అనే సూత్రాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## బీర్కూరు గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్

**భోజనం వికటించి 17మంది విద్యార్థులకు అస్వస్థత**

**నిజామాబాద్,జూలై6 :** బీర్కూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం రాత్రి భోజనం వికటించి 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 12 మంది విద్యార్థులను ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. కాగా సోమవారం మరో ఐదుగురి విద్యార్థులను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. 15 మంది విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వారిని డిశ్చార్జ్ చేసినట్లు, మరో ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బీర్కూర్ మండల వైద్యాధికారిని శ్రీలేఖ తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలకు భోజనం చేయగా కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ బాన్సువాడ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.

## చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం

**అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్**

**అయోధ్య,జూలై6 :** అయోధ్య విరాళాల చోరీ ఘటన నేపథ్యంలో శ్రీ రామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించిన ట్రస్టు.. ఆయన స్థానంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి మీడియాకు వెల్లడించారు. అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 3 గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశానికి ట్రస్ట్ ఛైర్మన్ నృత్యగోపాల్ దాస్‌తో పాటు తొమ్మిది మంది శాశ్వత సభ్యుల్లో ఏడుగురు హాజరు కాగా.. చంపత్ రాయ్, మిశ్రా మాత్రం హాజరు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం అనంతరం గోవింద్ గిరి మాట్లాడుతూ.. ఆలయంలో చోరీకి గురయ్యాయని చెబుతున్న విలువైన వస్తువులన్నింటినీ ప్రదర్శిస్తామన్నారు. చంపత్ రాయ్‌ను సమర్థిస్తూ.. తన దృష్టిలో ఆయన నిష్కళంకుడు అన్నారు. ఆలయ ఉద్యమం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ప్రశంసించారు. విరాళాల చోరీకి పాల్పడిన దోషులకు కఠిన శిక్ష పడాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. సనాతనంపై ఆకస్మికంగా ప్రేమను ప్రదర్శిస్తున్న వారు హిందువులను విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాగే, ఈ కేసులో దోషులుగా తేలిన వారికి తగిన శిక్షలు ఉంటాయని తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కృష్ణమోహన్ తెలిపారు. ఈ ఘటనతో తమ ప్రతిష్ఠ దెబ్బతిందన్న ఆయన.. ట్రస్టీలందరూ భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, ట్రస్టు లక్ష్యాలకు అనుగుణంగా విరాళాలను సమర్థంగా నిర్వహించేలా కృషిచేస్తారని తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న లెనిన్ బృందం

**తిరుమల,జూలై6 :** లెనిన్ సినిమా విడుదల సందర్భంగా అక్కినేని నాగార్జున, అమల, అఖిల్, సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండలపంలో వేదా ఆశీర్వచనం అనంతరం శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## నిర్లక్ష్యంగా బిఎల్‌వోల వ్యవహారం

**ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు**

**హైదరాబాద్,జూలై6 :** బీఎల్‌వోలు రాష్ట్ర వ్యాప్తంగా సక్రమంగా పని చేయటం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఎన్నిక లసంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని వినోద్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ ఎల్. రమణ, సోమా భరత్, కర్నె ప్రభాకర్, వై సతీష్ రెడ్డి, సుమిత్రానంద్ కలిశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తరపున సీఈవోకు వినపతి పత్రం అందించామన్నారు. సర్ కోసం బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రత్యేక కమిటీ వేసింది. ఈ కమిటీ బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పనిచేయటం కోసం వీళ్లని నియమించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా వినతులు మాకు వచ్చాయి. అవన్నీ సీఈవో సుదర్శన్ రెడ్డికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్ ఓటర్లకు ఇవ్వడం లేదు. చాలా మందికి ఇంకా ఫామ్ అందలేదన్నారు.

## పాత ఫర్నీచర్ సేకరణకు జిహెచ్‌ఎంసి నిర్ణయం

**కాల్వలు, రోడ్లపై పడేయకుండా చర్యలు**

**హైదరాబాద్,జూలై6 :** భాగ్యనగర వాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఇంట్లో పనికిరాని పాత పరుపులు, సోఫాలు, కుర్చీలు, టేబుళ్లు వంటి భారీ వ్యర్థాలను ఇకపై రోడ్లపై, మురుగు కాలువల్లో పడేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఇళ్ల వద్ద నుంచే ఉచితంగా సేకరించే ప్రత్యేక సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ తన అధికారిక 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా భారీ వ్యర్థాలను వీధులు, ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో పడేయకుండా నూతన సేవను వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ విజ్ఞప్తి చేసింది. ఈ మార్పు హైదరాబాద్ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ దోహదం చేస్తుందని పేర్కొంది. ఇంటి వద్దకే వచ్చి పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఉచితంగా సేకరించి, సురక్షితమైన, శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్ చేస్తామని జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఇందుకోసం క్యూఆర్ (ఖీఖ్) కోడ్‌ను స్కాన్ చేసి డోర్‌స్టెప్ పికప్‌ను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ సేవ తమ పరిధిలోని ఆరు జోన్లలో అందుబాటులో ఉందని జీహెచ్‌ఎంసీ తెలిపింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్ల ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వెల్లడించింది. సేవా పరిధిని కవరేజ్ మ్యాప్ ద్వారా తెలుసుకుని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉచిత పికప్‌ను బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జీహెచ్‌ఎంసీకి అప్పగించడం ద్వారా పరిశుభ్రమైన హైదరాబాద్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది.

## కాజీపేటలో అనూహ్య ఘటన

**వీడియో కాల్‌లో చూపి వ్యక్తి ఆత్మహత్య**

**వరంగల్, జూలై 6 :** కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో తీవ్ర కలకలం రేపే ఘోర సంఘటన వెలుగుచూసింది. మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి తన భార్యకు మొబైల్‌లో వీడియో కాల్ చేసి, తానేం చేయబోతున్నాడో లైవ్‌లో చూపిస్తూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళ్లెదుటే భర్త ప్రాణాలు కోల్పోవడాన్ని చూసి సదరు భార్య, కుటుంబ సభ్యులు తీవ్ర షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరంగల్ ప్రాంతానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ రాజేష్ నాయక్ (45) గా గుర్తించారు. గత కొంతకాలంగా రాజేష్ నాయక్ కుటుంబంలో ఆస్తి పంపకాల విషయమై తీవ్రస్థాయిలో మనస్పర్థలు, ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఈ వ్యవహారం సర్దుమణగకపోవడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి కూడా ఆస్తి పంపకాల విషయమై భార్యతో రాజేష్ నాయక్‌కు తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఆగ్రహంతో ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయారు. ఇంట్లోంచి నేరుగా కాజీపేట రైల్వే ట్రాక్ సమీపానికి చేరుకున్న రాజేష్ నాయక్.. రాత్రి వేళ తన భార్యకు స్మార్ట్‌ఫోన్ ద్వారా వీడియో కాల్ చేశారు. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు భార్యకు చెబుతూ.. కదిలివస్తున్న రైలు కింద పడి క్షణాల వ్యవధిలో తనువు చాలించారు. ఫోన్ కట్ చేసే లోపే ఈ ఘోరం జరిగిపోవడంతో భార్య కేకలు వేస్తూ బంధువులకు సమాచారం అందించారు. ఈ లోగా సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాల వల్ల ఒక నిండు ప్రాణం ఇలా అర్ధాంతరంగా రైలు పట్టాలపై బలికావడం స్థానికంగా తీవ్ర శోకాన్ని నింపింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

**డిఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన ఏసీబీ**

**హైదరాబాద్, జూలై 6 :** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో నమోదైన కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో ఆస్తులు బయటపడటంతో ఆయనపై ఏసీబీ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఐదు రోజుల క్రితం ఏసీబీ అధికారులు భీమ్‌రెడ్డితో పాటు ఆయన బంధువులకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించాచిన విషయం తెలిసిందే. తెలంగాణలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ దాడుల్లో పలు విలువైన ఆస్తులు, పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా సుమారు రెండు కిలోల బంగారం, 20 కిలోల వెండి, 23 విదేశీ మద్యం సీసాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. సోదాల అనంతరం భీమ్‌రెడ్డి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కేసులో స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, వాటి మూలాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలపై ఏసీబీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. డీఎస్పీ స్థాయి అధికారిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## కన్నెపల్లి పంపు ప్రారంభించాలి

**హైదరాబాద్,జూలై6 :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన చర్యల వల్లే రాష్ట్రంలో వరి భారీగా పండుతోందని ఆ పార్టీనేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. మేడిగడ్డ అనేది కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న అంశమని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కదా.. ఎందుకు భారీగా పండలేదు కన్నెపల్లి పంపుహౌస్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీరు నింపాలి. పూర్తిగా నింపకపోయినా.. పాక్షికంగానైనా నింపాలి. ఇసుక మాఫియాను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

## కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం

**హుండీ లెక్కింపులో రూ.3 కోట్లపైగా నగదు రాక**

**విజయవాడ,జూలై6 :** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. 16 రోజుల హుండీ లెక్కింపును పరిశీలిస్తే రోజుకు సగటున రూ.21 లక్షల 23 వేల మేర అమ్మవారి హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో శీనూ నాయక్ పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 16 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలు కనకదుర్గమ్మపై ఉన్న అపారమైన విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగదు, బంగారం, వెండి రూపంలో భక్తులు సమర్పించిన కానుకలు ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ దర్శనానికి రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. తాజాగా హుండీ లెక్కింపులో నమోదైన రూ.3.39 కోట్ల ఆదాయం ఆలయానికి భక్తుల నుంచి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

## చెట్లు నరికిన వారికి జరిమానా

**నిజామాబాద్,జూలై6 :** హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. అయితే కొందరు వ్యక్తులు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని కారణంతో మరికొందరు చెత్తను వారికి చేనుకు కంచె వేసుకుంటున్నారు. ఈ క్రమంలో పెరిగిన చెట్లు నరికి కంచవేశారు.. విషయం తెలుసుకున్న పందిమడుగు గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ స్పందించి చెట్లు నరికిన ఒకరికి రూ.2వేలు, మరొకరికి రూ.1000 జరిమానా విధించారు. ఎవరైనా రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి, సర్పంచ్ గోవింద్ తెలిపారు.

# పీఓకేలో మళ్లీ నిరసనలు

**రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు**
**పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి**
**భారత్ సాయం కోసం కొందరి అభ్యర్థన**



**శ్రీనగర్, జూలై 6 :** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచివేసేందుకు పాక్ కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏపీసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏపీసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది. కాగా.. జేఏపీసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళనలకు మద్దతు ఇస్తున్న జేఏపీసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. ఈ కమిటీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీఓకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.

# హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



**కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం.**

ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీ-యులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉ ందన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది.

ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొండగం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి.

జరిమానాలు విధించాయి. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపిం చడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగ రం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్‌సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్ ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

# శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

## ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జూలై 6 :** జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

# పశ్చిమాసియాలో దారికొస్తున్న పరిస్థితి

## చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ దేశాల నిర్ణయం

**న్యూఢిల్లీ, జూలై 6 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తత తగ్గిన నేపథ్యంలో ముడి చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ ప్లస్ కూటమికి చెందిన 7 దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఒపెక్ ప్లస్‌కు చెందిన సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, కువైట్, కజక్‌స్థాన్, అల్జీరియా, ఒమన్ దేశాలు ఆగస్టు నుంచి రోజుకు 1,88,000 బారెళ్ల అదనపు ఆయిల్ ఉత్పత్తి చేయడానికి అంగీకరించాయి. ఒపెక్ కూటమి నెలవారీ ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ఇది వరుసగా ఐదవసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలను స్థిరంగా ఉంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయిల్ ఉత్పత్తిని పెంచడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో చమురు కొరత లేకుండా చూస్తూనే.. ధరలు మరీ పడిపోకుండా సమతుల్యతను కాపాడాలని ఒపెక్ భావిస్తోంది. గ్లోబల్ మార్కెట్లో చమురు ధరల్లో వచ్చే మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావం చూపుతాయి. గత మార్చి నెలలో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్ల వరకు చేరింది. ఇప్పుడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో ధరలు మళ్లీ పాత స్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఒపెక్ ప్లస్ దేశాల అదనపు ఆయిల్ ఉత్పత్తి వల్ల భారత్ లాంటి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలకు కొంత ఉపశమనం లభించనుంది. దేశంలో చమురు ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది.

# బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటి ఫికేషన్

## 24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల

**కోల్‌కతా, జూలై 6 :** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు పూర్తైన వెంటనే ఫలితాలు వెల్లడించనున్నారు.

# ట్రంప్ ఫోన్.. అమెరికన్ ఫుట్‌బాలర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

**వాషింగ్టన్ :** అమెరికన్ ఫుట్‌బాలర్ ఫోలారిన్ బాలోగన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది. దీంతో ప్రిక్వార్టర్స్ లో బెల్జియంతో జరిగే మ్యాచ్‌లో అతడు ఆడేందుకు మార్గం సుగమమైంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడంతో అతడిపై నిషేధం తొలగిపోవడం గమనార్హం. రౌండ్-32లో భాగంగా బోస్నియాతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడి కాలి మడిమపై తొక్కినందుకు గానూ బాలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. ప్రపంచకప్ నిబంధనల ప్రకారం అతనిపై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోను ఫోన్‌లో కోరినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఫుట్‌బాలర్‌పై సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది. అనంతరం ట్రంప్ దీనిపై పోస్ట్ చేశారు. "సరైన నిర్ణయం తీసుకుని.. జరిగిన అన్యాయాన్ని సరిదిద్దినందుకు ఫిఫాకు ధన్యవాదాలు" అంటూ రాసుకొచ్చారు. ఇలా ఆటగాడి సస్పెన్షన్‌ను ఎత్తివేయడం ఫిఫా చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. కాగా.. ఈ పరిణామాలపై బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫుట్‌బాల్ నైతిక విలువలకు ఇది విరుద్ధమని పేర్కొంది.



# భారత్‌కు చమురు ఎగుమతి చేసే రష్యా పోర్టులపై ఉక్రెయిన్ దాడి

**రష్యా :** రష్యాలోని చమురు క్షేత్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా సోమవారం తెల్లవారుజామున ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో భారత్‌కు చమురు ఎగుమతి చేసే బాల్టిక్ సముద్రంలోని వైసోట్స్క్, ఉస్ట్-లుగా పోర్టులు తీవ్రంగా దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు వెల్లడించారు. 70కి పైగా డ్రోన్లను కూల్చామన్నారు. చమురు శుద్ధి కర్మాగారాలపై డ్రోన్ దాడులు కొనసాగుతుండడంతో ఇంధనం నింపే కేంద్రాల వద్ద కిలోమీటర్ల మేర ట్యాంకర్లు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఉస్ట్-లుగా రష్యాలోని అతిపెద్ద ఓడరేవులలో ఒకటి. మాస్కోను బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా ఉక్రెయిన్ గతంలోనూ పలుమార్లు ఈ ఓడరేవును లక్ష్యంగా చేసుకుంది. రష్యా నుంచి భారత్‌కు ఎగుమతయ్యే మొత్తం చమురులో 60-70 శాతం.. బాల్టిక్ సముద్ర మార్గం (ప్రధానంగా ఉస్ట్-లుగా, ప్రిమోర్స్క్ ఓడరేవుల) ద్వారానే రవాణా అవుతోంది. అక్కడి నుంచి చమురు నౌకలు ఉత్తర సముద్రం, సూయజ్ కాలువ, ఎర్ర సముద్రం మీదుగా ప్రయాణించి భారత తీరాలకు చేరుకుంటాయి. అందువల్ల రష్యన్ ఓడరేవులు ధ్వంసమయితే ఆ ప్రభావం భారత్‌పైనా ఉంటుందని చమురు రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీకి ముందు..

# కీవ్‌పై రష్యా భారీ దాడి



**కీవ్ :** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో మాస్కో విరుచుకుపడడంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని.. 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. కీవ్‌లోని సైనిక-పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తమ దేశంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు చేపట్టినట్లు వెల్లడించింది. కీవ్‌పై మాస్కో అతిపెద్ద దాడులకు సిద్ధమవుతోం దని.. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం ముగిసిన వెంటనే ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేపట్టడానికి రష్యా ప్రణాళిక రచించినట్లు నిఘా వర్గాల నుంచి తమకు సమాచారం అందిందని జెలెన్‌స్కీ వెల్లడించారు. కాగా.. రష్యా దాడులకు కొన్ని గంటల ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. పుతిన్‌తో 90నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడానికి సాయం చేస్తానని ప్రతిపాదించారు. అంతకుముందు శనివారం జెలెన్‌స్కీతోనూ ట్రంప్ ఫోన్‌లో చర్చలు జరిపారు. ఇక, తుర్కియే వేదికగా జులై 7 నుంచి నాటో శిఖరాగ్ర సదస్సు జరగనుంది.



## మియాపూర్ మంగళవారం సంత వ్యాపారులకు శుభవార్త

**అధికారిక అనుమతులు జారీ**

**శేరిలింగంపల్లి, జూలై 06 (జనం వార్త) :** మియాపూర్ మంగళవారం సంత చిరు వ్యాపారులకు అధికారులు శుభవార్త అందించారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మియాపూర్ మంగళవారం సంత నిర్వహణకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నుంచి అధికారికంగా అనుమతి లభించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మంగళవారం సంత నిర్వహణకు అధికారిక అనుమతి లభించేందుకు సహకరించిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, సీఎంసీ కమిషనర్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సంత నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేష్ యాదవ్,అడ్వకేట్ కిషోర్ యాదవ్, లక్ష్మణ్,రాధాకృష్ణ యాదవ్,గణేష్ ముదిరాజ్,దేవేందర్, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు, మియాపూర్ మార్కెట్ వెజిటేబుల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అమర్నాథ్ మంచు లింగాన్ని దర్శించుకున్న గురుస్వాములు

**సుదర్శన్, వెంకటేష్ గౌడ్**

**హైదరాబాద్ జూలై 06 (జనం వార్త) :** హిందువులకు అతి పవిత్రమైన పుణ్యక్షేత్రం అమర్ నాథ్ మంచు లింగాన్ని సోమవారం హైదరాబాద్ వాసులు దర్శించుకున్నారు. బొల్లారం ప్రాంతానికి చెందిన సుదర్శన్,చర్లపల్లికి చెందిన రుద్రగోని వెంకటేష్ గౌడ్,రాజేష్, కిరణ్ గౌడ్,గణేష్,డి కిరణ్,ప్రవీణ్,విజయ్, రామ్ ప్రసాద్ లు మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. “హర హర మహాదేవ్” నినాదంతో పవిత్రమైన మంచు శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా మంచు శివలింగ స్వామిని దర్శించుకోవడంతో మాజన్మ ధన్యమైందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గురుస్వాములు సుదర్శన్,వెంకటేష్ గౌడ్ లను సభ్యులు ఘనంగా సన్మానించారు.



## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

- తలసాని శ్రీనివాస్ యాదవ్
- బన్సీలాల్‌పేటలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు

**సికింద్రాబాద్ :** అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసి, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా బన్సీలాల్‌పేట డివిజన్‌లోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి తలసాని శ్రీనివాస్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మారావు నగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్, రాజేందర్, అబ్బాస్, ఫహీం, విజయ శంకర్, దేశపాక శ్రీనివాస్, నిర్వాహకులు సుదర్శన్ బాబు, రాపాక అశోక్, మహేందర్, వెంకట్ బాబు, రంజిత్, సాయి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శీతల పండుగను అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి

**బంజారా సమాజం మనోభావాలను గౌరవించాలి : ధరావత్ బద్రు నాయక్**




**కారేపల్లి :** బంజారా సమాజానికి ఆరాధ్య దైవమైన శ్రీ శీతల మాత పండుగను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని బంజారా నాయకుడు ధరావత్ బద్రు నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది జూలై 7న జరగనున్న శీతల పండుగను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి, బంజారా సమాజం మనోభావాలను గౌరవించాలని కోరారు. బంజారా సంస్కృతి, ఆచార వ్యవహారాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, శీతల పండుగకు అధికారిక గుర్తింపు కల్పించడం ద్వారా గిరిజన సమాజానికి తగిన గౌరవం దక్కుతుందని ధరావత్ బద్రు నాయక్ అన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదులే కరువు

- వచ్చే ఫిర్యాదులన్నీ టౌన్ ప్లానింగ్ విభాగం పైనే
- సర్కిళ్లలో సమస్యలు లేవా...? లేక పరిష్కారం కావనే అపనమ్మకమా...?




**కూకట్‌పల్లి, జూలై 6, (జనంవార్త) :** ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో, ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింత చేరువ చెయాలానే మంచి ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చెపట్టిన ప్రజా పాలన కార్యక్రమం నీరుకారిపోతుంది. కూకట్ పల్లి జోనల్ కార్యాలయంతో పాటు ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అసలు సమస్యలే లేనట్లు స్థానికుల నుండి ఫిర్యాదులు అందడం లేదు. కానీ ప్రతి సోమవారం టౌన్ ప్లానింగ్ విభాగం పై మాత్రం క్రమం తప్పకుండా అధికంగా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది. కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగంపై 5 ఫిర్యాదులు అందగా, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 5 ఫిర్యాదులు రాగా శానిటేషన్ విభాగానికి మరో ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది. కూకట్ పల్లి, ఆల్విన్ కాలనీ సర్కిల్ ల పరిధిలో స్థానికంగా నెలకొన్న సమస్యలపై గత కొంతకాలంగా స్థానిక ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సందర్భాలు చాలా తక్కువగా కనబడుతున్నాయి. కానీ కొందరు అదే పనిగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంతో పాటు టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో అక్రమ నిర్మాణాలపైనే కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. టౌన్ ప్లానింగ్ విభాగం లోని అధికారులు స్పందించి ఫిర్యాదుదారునికి అనుకూలంగా వ్యవహరించడంతో ఈ విభాగానికి ఫిర్యాదులు అధికమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు వచ్చిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహారిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఫిర్యాదు దారుడికి, అక్రమ నిర్మాణదారుడికి మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులే సయోధ్య కుదురుస్తున్నారని స్థానిక ప్రజలు బహిరంగానే చర్చించు కుంటున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అధిక శాతం ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో ఏ అక్రమ నిర్మాణంపై ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలు కనిపించడం లేదు. కూకట్ పల్లి , ఆల్విన్ కాలనీ సర్కిళ్ల పరిధిలో ఓవైపు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు పెరుగుతున్న అదే స్థాయిలో యాదేచ్చగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల స్థానికంగా పలు అనుమానాలకు తావిస్తుంది. అవినీతి అధికారులకు అందాల్సినవి అందితే ఆ ప్రక్కకే రారనే విమర్శ ఎప్పటి నుండో ప్రజల్లో వినిపిస్తుంది. అయినా మన అవినీతి అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు అయినా లేకపోవడం విశేషం.



### అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన, కేసు నమోదు చేసిన యాదేచ్ఛగా పూర్తి చేసిన నిర్మాణదారుడు

కేపిహెచ్ బి కాలనీ తొమ్మిదవ ఫేస్ లో ఓ అక్రమ నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడితే అధికారులు భవనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి నప్పటికీ ఆ అక్రమ నిర్మాణ దారుడు యాదేచ్ఛగా ఆ అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇప్పటివరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనం పై ఎలాంటి చర్యలు తీసుకుకపోవడం విశేషం. ఇంత జరుగుతున్న అధికారులకు తెలియదా..? అంటే అనుమానమే. అక్రమ నిర్మాణాన్ని సీజ్ చెసిన, అక్రమ నిర్మాణదారుడిపై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసిన నిర్మాణదారుడు యాదేచ్ఛగా తన నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడం వెనుక మన అవినీతి అధికారుల హస్తం ఉందనడంలో సందేహం లేదు. టౌన్ ప్లానింగ్ అవినీతి త్రిమింగళాలు ఈ విధంగా అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తుంటే ప్రభుత్వ అదాయానికి గండిపడదామరి..!

### ప్రజావాణిలో మౌలిక సమస్యలపై కనిపించని ఫిర్యాదులు

రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతి సోమవారం సర్కిల్ ల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్తు, రోడ్లు వంటి సమస్యలపై మాత్రం ఫిర్యాదులు అందడం లేదు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సమస్యలు పరిష్కారం కావడం లేదని, తూ తూ మంత్రంగా ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనే వాదనలు స్థానిక ప్రజలలో బలంగా ఉండడంతో సమస్యలపై ఫిర్యాదులు చేయడం లేదనే స్థానిక ప్రజలే బహిరంగంగా మాట్లాడుతున్నారు.

– రాము సామల
939 939 6555



## గుల్షన్‌నగర్ నాలా దుస్థితిపై డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**శేరిలింగంపల్లి, జూలై 6(జనం వార్త):** అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని గుల్షన్ నగర్ బస్తీలో ఉన్న నాలా అధ్వాన్న పరిస్థితిపై స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలాలో భారీగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్మాణ శిథిలాలు పేరుకుపోవడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొద్దిపాటి వర్షానికే నాలా పొంగిపొర్లి రోడ్లపై వరద నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. అలాగే నాలాలో పేరుకుపోయిన చెత్త కారణంగా దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంజయ్యనగర్





డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ సోమవారం డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. గుల్షన్ నగర్ నాలాను అత్యవసరంగా పూర్తిస్థాయిలో శుభ్రపరిచి, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి నాలా శుభ్రపరిచే పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నయీమ్, రోహిత్, శ్రీనివాస్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

**సికింద్రాబాద్ :** సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన 200 మంది విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సొసైటీ ఫౌండర్ అండ్ చైర్మన్ చంద్రశేఖర్ జి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్సిల్ బాక్స్‌లు, పెన్నులు, దుస్తులు అందజేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రేరణాత్మక సందేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లైఫ్ లిఫ్ట్ సొసైటీ జనరల్ సెక్రటరీ, అడ్వకేట్ గాజుల సంగీత ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, ప్రతి విద్యార్థి లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని




సూచించారు. అలాగే శ్రీవారి సేవ సభ్యులు, లైఫ్ లిఫ్ట్ సొసైటీ సభ్యులు, చైతన్యశ్రీ, ఉదయ్ తేజ, గౌతమి, లక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ అండ్ చైర్మన్ చంద్రశేఖర్ జి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. పేద విద్యార్థులకు మరింత సహాయం అందించే దిశగా లైఫ్ లిఫ్ట్ సొసైటీ సేవలను మరింత విస్తరిస్తాం అని తెలిపారు.



## బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** భారత మాజీ ఉపప్రధాని, నవభారత నిర్మాత, నిరుపేదలు మరియు వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పికెట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, దేశ రాజకీయాలు, సామాజిక సేవా రంగాల్లో బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అణగారిన, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. కేంద్ర మంత్రిగా, దేశ ఉపప్రధానిగా బాబూ జగ్జీవన్ రామ్ నిర్వహించిన బాధ్యతలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవానికి శ్రీకారం చుట్టి దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం, ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.

## డ్రైనేజీ లేక దుర్భరంగా కారేపల్లి..

**ప్రజావాణిలో డీవైఎఫ్ఐ వినతి**

**కారేపల్లి :** సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు, మురుగునీటితో కారేపల్లి గ్రామం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటోందని, వెంటనే శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సింగరేణి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సింగరేణి మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీటితో పాటు ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు, కారేపల్లి బస్టాండ్ సెంటర్, బీసీ కాలనీ, భరత్‌నగర్, అంబేద్కర్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలోని ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి దోమలు, పందులు, వీధి కుక్కలకు నిలయాలుగా మారాయని, దీంతో ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం మరింత పెరిగిందని, అధికారులు వెంటనే స్పందించి మురుగునీటిని తొలగించడం, బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య చర్యలను చేపట్టాలని కోరారు.



## తిరుమలకు కాలినడకన 116 ఏళ్ల వృద్ధురాలు

### వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించిన అధికారులు

**తిరుమల, జూలై 6 :** శ్రీవారి దర్శనం కోసం కాలినడకన వచ్చిన 116 ఏళ్ల వృద్ధురాలు నవనీతమ్మకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు. వందేళ్లు దాటిన వృద్ధురాలు శనివారం నాడు అలిపిరి నడక మార్గంలో తిరుమలకు వచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను కొంతమంది సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అయితే ఆ వృద్ధురాలిది కర్ణాటక అని మొదట ప్రచారం జరిగింది. ఇది చూసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వృద్ధురాలి వివరాలు తెలిస్తే టీటీడీ ఆఫీసులో సంప్రదించాలని ఎక్స్‌లో పోస్టు కోరారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఆమె వివరాలను సేకరించారు. వృద్ధురాలిని తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించి, టీటీడీ చైర్మన్‌కు సమాచారం అందించారు. వృద్ధురాలి వివరాలను తెలుసుకున్న బీఆర్ నాయుడు ఆమెతో పాటు కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం టీటీడీ అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. నవనీతమ్మకు నమస్కరించి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు. దీనిపై బీఆర్ నాయుడు మరోసారి స్పందిస్తూ.. నవనీతమ్మను గుర్తించడంలో తమవంతు సహకారం అందించిన సోషల్‌మీడియా మిత్రులందరికీ, అలాగే టీటీడీ విజిలెన్స్ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఒక భక్తురాలి జీవితకాల కోరిక నెరవేర్చిన ఈ సందర్భంగా తమ అందరికీ ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించిందని పేర్కొన్నారు.

## దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

### ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి, జూలై 6 :** టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను మరింత కాలం కొనసాగించాలి' అని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సామాజిక న్యాయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు, సమాన అవకాశాలు కలిగిన సమసమాజ నిర్మాణానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్. దేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి బలమైన పునాది వేసి, ఆహార భద్రత సాధనలో విశిష్ట పాత్ర పోషించిన దూరదృష్టి గల నాయకుడు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.



## అణ్వస్త్ర రహిత ప్రాంతంలో చైనా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

### పలు దేశాల ఆందోళన

**చైనా :** దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని అణ్వస్త్ర రహిత మండలంలో అణుశక్తి జలాంతర్గామి నుంచి చైనా దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని సోమవారం పరీక్షించింది. ఈ ప్రయోగం పలు ప్రాంతీయ దేశాల్లో ఆందోళనకు దారి తీసింది. దీనిపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, ఈ ప్రయోగం సైనిక వార్షిక శిక్షణలో భాగమేనని చైనా తెలిపింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామని, ఏ దేశాన్నీ లేదా లక్ష్యాన్నీ ఉద్దేశించి చేయలేదని పేర్కొంది. అందులో నిజమైన అణు వార్‌హెడ్‌కు బదులుగా డమ్మీ వార్‌హెడ్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఇదే తరహా పరీక్షను రెండేళ్ల కిందట కూడా నిర్వహించినట్లు చైనా తెలిపింది. మరోవైపు, 1986 రారోటోంగా ఒప్పందం ప్రకారం ఈ ప్రాంతంలో అణ్వాయుధ పరీక్షలు, వినియోగం నిషేధించారు. చైనా 1987లో ఈ ఒప్పందానికి మద్దతిచ్చి ఆ ప్రాంతంలో అణ్వాయుధాలను పరీక్షించబోమని, ఒప్పంద దేశాలను అణ్వాయుధాలతో బెదిరించబోమని హామీ ఇచ్చింది. ఇలాంటి కార్యకలాపాలపై తాము చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ.. సమాచారం ఇచ్చిన గంటల వ్యవధిలోనే చైనా ఈ పరీక్ష నిర్వహించిందని న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం ప్రాంతీయ స్థిరత్వానికి భంగం కలిగించే చర్య అని ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ పేర్కొన్నారు.

# దక్షిణకొరియా పర్యటనలో లోకేశ్

### పెట్టుబడుల కోసం పలువురితో వరుస భేటీలు



**అమరావతి, జూలై 6 :** దక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ అయి చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో షూఆల్స్ పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని షూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై షూఆల్స్ ఛైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీలో రూ.300 కోట్లతో షూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్ హాతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలో సోలమ్ యూనిట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ తయారీ విస్తరణకు మంత్రి ఆహ్వానించారు. శ్రీసిటీ పనులు వేగవంతం చేస్తామని సోలమ్ సంస్థ పేర్కొంది. రూ.338 కోట్లతో శ్రీసిటీలో సోలమ్ ఈవీ ఛార్జర్ యూనిట్ నిర్మాణం జరగనుంది. ఆపై సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్-సుంగ్ చోతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించా రు. తిరుపతి ఐఐటీ సహకారంతో అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంట ర్‌కు ఆహ్వానం పలికారు. ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా సాఫ్ట్-ఈపీఐ సీఈవో తెలిపారు. కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపైనా మంత్రి లోకేశ్ దృష్టి సారించారు.



## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు



**అమరావతి, జూలై 6 :** ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదు-పాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ ఎ:ఓ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

## పెట్టుబడుల కోసం లైజన్ అధికారుల నియామకం

### వివిధ దేశాలకు ప్రతినిధులుగా నలుగురికి బాధ్యతలు


### ఉత్తర్వులు జారీచేసిన ఏపీ ప్రభుత్వం


**అమరావతి, జూలై 6 :** ఏపీ ప్రభుత్వం కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ -1333 ద్వారా ఈ నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ అనుసంధానంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది.

## ముంబయిలో భారీ వర్షాలు..

### విరిగిపడిన కొండచరియలు

**ముంబయి :** మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తోన్న వానలకు కొండచరియలు విరిగిపడటంతో పుణె-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే, ఓల్డ్ ముంబయి-పుణె హైవేపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గాల్లో పూర్తిగా ట్రాఫిక్‌ను నిలిపివేశామని, తదుపరి నోటీసులు వచ్చేవరకు ఇటుగా ప్రయాణించవద్దని మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెల్లడించింది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ అడ్వైజరీలను గమనించుకోవాలని సూచించింది. ఈ వర్షాలతో రోడ్డు మార్గంతో పాటు రైలు నెట్‌వర్క్ ప్రభావితమైంది. సోమవారం నడవాల్సిన 16 రైళ్లు నిలిచిపోయాయి. అటు విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రానున్న గంటల్లో ముంబయి, థాణె, నవీ ముంబయి, పాల్ఘర్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దాంతో ఈ జిల్లాల్లోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. మన్‌కుర్ద్ ప్రాంతంలో ఆదివారం రాత్రి నివాస భవనం కూలి ఆరుగురు మృతి చెందారు. వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు.







## జమ్ముకశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

**కిశ్త్‌వాడ్ :** జమ్ముకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడి అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద పలు వాహనాలు బురద, రాళ్ల కింద కూరుకు పోయాయి. వాటిని తొలగించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడం వల్ల ప్రాజెక్ట్ సైట్‌కు వెళ్లే రహదారిపై భారీ పరిమాణంలో కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు పేర్కొన్నారు. వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు బురద కింద కూరుకుపోయాయన్నారు. దాన్ని తొలగించి వాహనాలను బయటకు తీసేందుకు భారీ యంత్రాలతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది, పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ప్రజలు, పర్యాటకులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు

- పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలు తక్షణం పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, జూలై 6 :** గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజనులకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే లక్ష్యమని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏయే విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ - బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశిరచారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## పోలవరం సముద్ర తీరంలో మత్స్యకారుల గల్లంతు

### నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో మంత్రి అచ్చన్న సమీక్ష

**అమరావతి, జూలై 6 :** అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం సముద్ర తీరంలో పడవ బోల్తా ఘటనలో మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. సోమవారం గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో సమావేశమై చర్చించారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రెండో రోజూ ప్రత్యేక నౌక, రెస్క్యూ బోటు, హెలికాప్టర్‌తో నేవీ, కోస్ట్ గార్డు సంయుక్త గాలింపు కొనసాగుతోందని మంత్రికి అధికారులు తెలిపారు. కారి చిన్న ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. కారి చిన్నను విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు కోస్ట్ గార్డు తీసుకురానుంది. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్యలు ఉన్నారు.

## పేర్ని నానిలా పార్టీలు మారలేదు

### మంత్రి సత్యకుమార్ కౌంటర్

**అనంతపురం, జూలై 6 :** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నాని చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటారంటూ వ్యాఖ్యానించారు. 'నేను పార్టీలు మారే అవకాశవాదిని కాదు.. నాని అవకాశం కోసం పార్టీలు మారుతాడు. నా రక్తంలోనే కాషాయం ఉంది. ఒక మంత్రిగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోను అని హెచ్చరించారు. జగన్‌ను నేను వ్యక్తిగతంగా ఎప్పుడూ తిట్టలేదు.. ఆయన వ్యతిరేక సిద్ధాంతాలపైనే మాట్లాడుతాను. సంకీర్ణ ప్రభుత్వంలో నేను మంత్రిని' అని చెప్పుకొచ్చారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతి త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. రాజధానిపై జగన్ మాట్లాడటం చూస్తే అవగాహనా లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొన్ని చోట్ల మార్పు రావాల్సి ఉందని.. దానిపై కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి ఫిర్యాదుపైనా చర్యలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## మాకు భారత్ మద్దతు ఉంది: నెతన్యాహు




**వాషింగ్టన్:** భారత్ నుంచి తమకు మద్దతు ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్ని ఇజ్రాయెల్ గౌరవించాలని, యావత్ ప్రపంచంలో శక్తిమంతమైన అమెరికా మద్దతు మాత్రమే ఇజ్రాయెల్‌కు ఉందని ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చేసిన వ్యాఖ్యను ఆదివారం ఆయన ఖండించారు. "మాకు అనేక దేశాల అండ ఉంది. వాటిలో ఓ 'చిన్న' దేశమైన ఇండియా కూడా. ఆ దేశంలో 140 కోట్ల మంది ప్రజలున్నారు" అని వాన్స్‌కు చురక అంటించారు. ఫేస్‌బుక్‌లోనూ తనకు మద్దతు ఉందని చెప్పారు. తమ దేశంలోని అగ్రశ్రేణి సైబర్ భద్రత నిపుణుల సాయాన్ని అనేక దేశాలు కోరుతుంటాయన్నారు. చాలా దేశాల నేతలు తనకు ఫోన్ చేసి, వారి సమస్యలు చెప్పి ఏఐ, సైబర్ నిపుణుల చేయూతను కోరుతుంటారని వివరించారు. ప్రపంచంలో సైబర్ రంగంలో ఇజ్రాయెల్ రెండోస్థానంలో ఉందని, తమ సాంకేతికత ఎంతో మేలైనదని నెతన్యాహు చెప్పారు.

# నాలుగో రోజు లాభాల్లోనే..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, క్యూ1 ఫలితాలపై ఆశావహ దృక్పథం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,400 పాయింట్ల పైకి ఎగబాకింది. నిఫ్టీ 159.50 పాయింట్ల లాభంతో 24,430.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, రిలయన్స్, ఐసీఐసీఐ, మారుతీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. కోటక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.38గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,148.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.







## త్వరలో మొబైల్ రీఛార్జ్‌లు భారం..

### 12-15% టారిఫ్‌లు పెరిగే ఛాన్స్

ఫోన్ రీఛార్జ్ ప్లాన్ ధరలను మరోసారి పెంచేందుకు టెలికాం కంపెనీలు సిద్ధమవుతున్నాయి. మొబైల్ టారిఫ్‌లు 12-15 శాతం పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ వెల్లడించింది. టెలికాం మార్కెట్‌లో పోటీ తగ్గడంతో పెంపునకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని అభిప్రాయపడింది. రానున్న 3-4 నెలల్లో ఈ పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. 5జీ నెట్‌వర్క్ విస్తరణ కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టడానికి టెలికాం కంపెనీలు త్వరలో ఛార్జీలు పెంచొచ్చని ఇప్పటికే అంచనాలున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దేశీయ టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ కంపెనీలు తమ హవాను కొనసాగిస్తున్నాయి. ప్రతి నెలా కొత్త సబ్‌స్క్రైబర్లను ఆకర్షించడంలో ముందు వరుసలో ఉంటున్నాయి. మరో ప్రైవేటు టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా కూడా కొత్త యూజర్లను చేర్చుకుంటున్నప్పటికీ.. జియో, ఎయిర్‌టెల్‌తో పోల్చినప్పుడు ఈ అంతరం ఎక్కువగా ఉంటోంది. త్రైమాసిక ప్రాతిపదికన చూసినప్పుడు జియోకు కొత్తగా సగటున 70 లక్షల మంది చందాదారులు చేరొచ్చని, భారతీ ఎయిర్‌టెల్‌ను 50 లక్షల మంది ఎంచుకోవచ్చని పేర్కొంది. వొడాఫోన్ ఐడియాలో 2 లక్షల సబ్‌స్క్రైబర్లు చేరొచ్చని నివేదిక తెలిపింది. దేశంలోని 90 శాతానికి పైగా జిల్లాల్లో జియో, ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను అందిస్తున్నాయి. వొడాఫోన్ ఐడియా కూడా దాదాపు 100 నగరాల్లో తన 5జీ సేవలను విస్తరించింది. వినియోగదారులు 2జీ నుంచి 4+, 5+ నెట్‌వర్క్‌లకు మారుతుండడం, పోస్టుపెయిడ్ యూజర్లు పెరుగుతుండడంతో టెలికాం కంపెనీల సగటు ఆదాయం కూడా మెరుగు కానుందని నివేదిక పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ఇది 1-1.5% పెరుగుతుందని అంచనా వేసింది. 4జీ, 5జీ వినియోగం పెరుగుతుండటంతో డేటా వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని తెలిపింది.



## స్వర్ణయుగంలో మహిళా క్రికెట్

### ఐసీసీ ఛైర్మన్ జైషా

టీ20 ప్రపంచ కప్ విజేతగా ఆస్ట్రేలియా ఏడోసారి నిలిచింది. ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. ఐసీసీ ఛైర్మన్ జైషా చేతుల మీదుగా ఆసీస్ కెప్టెన్ సోఫీ మోలినెక్స్ కప్పును అందుకొంది. ఈ సందర్భంగా జై షా సోషల్ మీడియా వేదికగా ఆస్ట్రేలియాకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మహిళా క్రికెట్ ఇప్పుడు స్వర్ణయుగంలో ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సచిన్ కూడా ఆసీస్‌కు కంగ్రాట్స్ చెబుతూ పోస్టు పెట్టారు. "క్రికెట్ ఆస్ట్రేలియాకు శుభాకాంక్షలు. ఏడోసారి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌ను అందుకొన్నారు. ఫైనల్‌కు చేరుకున్న ఇంగ్లాండ్‌కూ అభినందనలు. మహిళల క్రికెట్‌ను తప్పకుండా ఎందుకు చూడాల్సిందో ఈ టోర్నీ మనకు చెబుతుంది. మహిళా క్రికెట్‌లో పోరాటం, గెలవాలనే తపనను వీక్షించాల్సిందే. ఆరంభం నుంచి చివరి వరకూ శక్తి, పట్టుదల, అద్భుతమైన ప్రతిభ వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రపంచ కప్‌ను ఆకర్షణీయంగా మార్చిన ప్రతి జట్టుకూ ధన్యవాదాలు. ప్రతి మహిళా క్రికెటర్‌కు అభినందనలు. మహిళా క్రికెట్‌కు ఇప్పుడు స్వర్ణయుగం" అని జై షా పోస్టు చేశారు.



## మూడో టీ20లో రవి బిష్ణోయ్‌పై వేటు

### అదనపు సీమర్‌తో భారత్?

యూకే పర్యటనలో టీమ్‌ఇండియాకు ఇప్పటి వరకు ఒక్క విజయం కూడా రాలేదు. శ్రేయస్ నాయకత్వంలో భారత్ నాలుగు మ్యాచులు ఆడింది. ఐర్లాండ్‌తో రెండు టీ20ల్లోనూ ఓటమి తప్పలేదు. ఇక ఇంగ్లాండ్‌తో ఒక మ్యాచ్ రద్దు కాగా.. మరొక దాంట్లో పరాజయం ఎదురైంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటలకు మూడో టీ20 జరగనుంది. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా తలపడే ఈ మ్యాచ్‌లో తుది జట్టు ఎంపిక అత్యంత కీలకం కానుంది. మరీ ముఖ్యంగా గత మ్యాచ్‌లో ఘోరంగా విఫలమైన రవి బిష్ణోయ్‌ను తప్పించడం ఖాయంగానే కనిపిస్తోంది. మూడో టీ20కి వేదిక ట్రెంట్ బ్రిడ్జ్. ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. అలాగే పేస్ బౌలర్లకు ఆరంభంలో సహకారం లభించనుంది. దీంతో అదనంగా ఉన్న స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తప్పించి.. మరో ఫాస్ట్ బౌలర్ లేదా పేస్ ఆల్‌రౌండర్‌కు ఛాన్స్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఫాస్ట్ బౌలింగ్ రేసులో ప్రిన్స్ యాదవ్‌తో పాటు ప్రసిద్ధ్ కృష్ణ ఉన్నాడు. కానీ, ప్రసిద్ధ్ ఐర్లాండ్‌పైనే తేలిపోయాడు. ప్రిన్స్ కాస్త మెరుగైన ప్రదర్శన చేశాడు. దీంతో మేనేజ్‌మెంట్ ప్రిన్స్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. మరోవైపు బ్యాటర్ కమ్ పేసర్ అయిన సూర్యాంశ్ షెడ్గేని పరిగణనలోకి తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. లోయర్ ఆర్డర్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేయగలడు. అలాగే నాలుగు ఓవర్ల కోటా లేదా కనీసం రెండు ఓవర్లను సంధించగలడు. మరోవైపు శివమ్ దూబే రూపంలోనూ భారత్‌కు మరొక మీడియం పేసర్ అందుబాటులో ఉన్నాడు. మిగతా బౌలింగ్ యూనిట్ నుంచి పెద్దగా సమస్యల్లేవు.

**ఈసారి వైభవ్ నుంచి..** ట్రెంట్ బ్రిడ్జ్ బౌలింగ్‌తోపాటు బ్యాటర్లకూ స్వర్గధామమే. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన వైభవ్ సూర్యవంశీ నుంచి పెద్ద ఇన్నింగ్స్‌ను అభిమానులు ఆశిస్తున్నారు. అందుకు ఇదే సరైన వేదిక అయ్యే అవకాశం ఉంది. కాసేపు క్రీజ్‌లో నిలదొక్కుకుంటే.. భారీ స్కోరు ఖాయమే. ఇషాన్ కిషన్ నుంచి ఇంకాస్త దూకుడును అభిమానులు కోరుకుంటున్నారు. గత మ్యాచ్‌లో శ్రేయస్, తిలక్ వర్మ వేగంగా ఆడటం సానుకూలాంశం. సిరీస్ రేసులో నిలవాలంటే మూడో మ్యాచ్‌లో గెలవడం టీమ్‌ఇండియాకు అత్యంత కీలకం.

## వైభవ్ సూర్యవంశీ కేవలం ట్రైలర్ మాత్రమే చూపించాడు

### మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



భారత్ తరఫున జాతీయ జట్టులో అరంగేట్రం అతిపిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ ఘనత సాధించిన సంగతి తెలిసిందే. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే డెబ్యూ చేశాడు. ఇంగ్లాండ్‌పై రెండో టీ20లో 10 బంతుల్లో 14 పరుగులు చేశాడు. విల్ జాక్స్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయి పెవిలియన్‌కు చేరాడు. అయితే, అతడు కేవలం ట్రైలర్ మాత్రమే చూపించాడని భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. "జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడటం నాకు బాగా నచ్చింది. వైభవ్ తన ఉద్దేశం ఏంటో ట్రైలర్‌లోనే చెప్పేశాడు. అంతర్జాతీయ వేదికపై ఎలాంటి బెరుకు లేకుండా ఆడాడు. అతడి ముఖంలో ఏమాత్రం భయం, ఒత్తిడి కనిపించలేదు. అతడు వేగంగా ఆడేందుకు మాత్రమే ఇక్కడ ఉన్నాడు. అందులో ఎలాంటి సందేహంలేదు. ఇక్కడ నాకొక ఆసక్తికర విషయం ఏంటంటే.. ఈ కుర్రాడు ఇప్పుడే ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. సుదీర్ఘమైన కెరీర్‌గా ఎలా తీసుకెళ్తాడనేది చూడాలి. అయితే, అతడికి ఆ సత్తా ఉంది. వైభవ్‌ను ఎవరితోనూ పోల్చొద్దు. ఫస్ట్ వైభవ్ సూర్యవంశీగానే ఉండనివ్వండి. అంతేకానీ.. రెండో బ్రాడ్‌మన్ లేదా రెండో సచిన్‌ను మాత్రం చేయొద్దు. అతడి జర్నీని చూద్దాం.. నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం" అని అశ్విన్ తెలిపాడు.

**కంగారు పడనక్కర్లేదు..**

"టీ20 ప్రపంచ కప్, 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఇప్పుడే వైఫల్యాల గురించి ఏమాత్రం కంగారు అవసరం లేదు. మనం విమర్శలను అమ్మితే.. బయట వాటిని కొంటారు. నెగెటివిటీ చాలా వేగంగా సర్క్యులేట్ అవుతుంది. ఇప్పుడు జట్టులో ఉన్న ప్లేయర్లకు కావాల్సినంత సమయం ఉంది. ఎవరైనా సరే వైఫల్యం చూడకుండా సక్సెస్ కాలేరు. సీనియర్లు ఒక్కొక్కరు వెళ్లిపోయిన తర్వాత.. యువ క్రికెటర్లు జట్టులోకి వచ్చారు. వైఫల్యాలను స్వీకరించకపోతే.. భవిష్యత్తులో మాస్టర్ క్రికెటర్లుగా మారలేరు" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

## మెదక్‌కు వరుసగా ఆరో ఓటమి..

### ప్లే ఆఫ్స్‌నకు ఖమ్మం ఏసెస్..



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో ప్లే ఆఫ్స్‌లో రెండో బెర్తును ఖమ్మం ఏసెస్ ఖరారు చేసుకుంది. సోమవారం మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఖమ్మం 19 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుని ఆ జట్టు 10 పాయింట్ల ముందంజ వేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం నిర్ణీత 20 ఓవర్లలో 190/5 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో మెదక్ ఫాల్కన్స్ 171/7 స్కోరుకు పరిమితమై వరుసగా ఆరో ఓటమిని చవిచూసింది. శృంజిత్ రెడ్డి (60; 46 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) రాణించాడు. చివర్లో ఇషాన్ శర్మ (34; 15 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు) మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. నమన్ అగర్వాల్ (32), సూర్య తేజ (26) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో విద్యానంద రెడ్డి, వాఫి కచ్చి, హర్షిత్ సాయి రెండేసి వికెట్లు పడగొట్టగా.. వేద్ రెడ్డి ఒక వికెట్ తీశాడు. తొలుత ఖమ్మం బ్యాటర్లలో హిమతేజ కొడిమెల (103; 57 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులు) శతకం బాదాడు. ప్రతీక్ రెడ్డి (32; 29 బంతుల్లో 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. మికిల్ జైస్వాల్ (15), వాఫి కచ్చి (14), సీవీ మిలింద్ (14) పరుగులు చేశారు. మెదక్ బౌలర్లలో రవితేజ 2, మధుకర్, అర్జున్ చెరో వికెట్ సాధించారు.

## నల్గొండపై హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ విజయం



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో లీగ్ దశను హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ అజేయంగా ముగించింది. నల్గొండ నైట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 'ఈ' ఛాంపియన్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్‌కు వరుసగా ఇది ఏడో విజయం. 188 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. చివర్లో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారగా.. వైష్ణవ్ రెడ్డి (41; 16 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇల్యాన్ వేసిన 17 ఓవర్లో వైష్ణవ్ నాలుగు సిక్సులు బాదేసి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అన్విత్‌రెడ్డి (40; 30 బంతుల్లో 6 ఫోర్లు), అభిరథ్‌రెడ్డి (39; 20 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), అజయ్ దేవ్ గౌడ్ (34; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. నల్గొండ బౌలర్లలో నిశాంత్ 2 వికెట్లు, అర్ఫాజ్ అహ్మద్, అనికేత్‌రెడ్డి, ఇల్యాన్ తలో వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన నల్గొండ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. వరుణ్ గౌడ్ (53; 32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించాడు. జశ్వంత్ (36), గౌరవ్ రెడ్డి (25), హర్షవర్ధన్ సింగ్ (23) పరుగులు చేశారు. హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ బౌలర్లలో షణ్ముక అశ్విన్ (4/19) అదరగొట్టాడు. అజయ్ దేవ్ గౌడ్ 2, ప్రణవ్ వర్మ 2, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ పడగొట్టారు.




## 'యూజర్‌నేమ్' వ్యవహారం..

### వాట్సప్‌నకు కేంద్రం మరో 3 రోజుల డెడ్‌లైన్

ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన 'యూజర్‌నేమ్' ఫీచర్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీంతో ఈ ఫీచర్‌పై వివరణ ఇవ్వాలని మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఆ గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో.. వాట్సప్‌నకు కేంద్రం కాస్త ఊరట కల్పించింది. నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు మరో 3 రోజుల పాటు అదనపు గడువు కల్పించింది. దీనిపై సంప్రదింపులు పూర్తయ్యేంతవరకు యూజర్‌నేమ్ ఫీచర్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకురాబోమని వాట్సప్ ఈ సందర్భంగా కేంద్రానికి తెలిపింది. ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం లేకుండానే సంభాషణలు జరపొచ్చని తెలిపింది. అయితే, ఈ ఫీచర్ వల్ల నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల వంటివి చోటుచేసుకునే అవకాశం ఉందని భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన కేంద్రం మెటాకు నోటీసులు జారీ చేసింది. ఈ ఫీచర్ ఐటీ చట్టాన్ని ఉల్లంఘించేలా ఉందని అందులో పేర్కొంది. ఆ చట్టం కింద వాట్సప్‌పై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. అంతేగాక, ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యేదాకా ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురావొద్దని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌పై వివరణ ఇచ్చేందుకు జులై 6 వరకు గడువు విధించడంతో మెటా ప్రతినిధులు.. కేంద్రాన్ని సంప్రదించారు. సమాధానం ఇచ్చేందుకు తమకు మరింత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ.. జులై 9 వరకు గడువు కల్పించింది.

## లులు మాల్‌లో 4 రోజుల పాటు ఫ్లాట్ 50% డిస్కౌంట్ సేల్

**హైదరాబాద్:** కూకట్‌పల్లి లులు మాల్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 'లులు ఆన్ సేల్' నిర్వహించనున్నారు. వినియోగదారులకు ఫ్లాట్ 50 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేల్‌కు సంబంధించి సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. టాలీవుడ్ నటుడు శ్రీనందు సందడి చేశారు. ఆయన చేతులమీదుగా సేల్ అధికారిక లోగోను, ప్రత్యేక టీ-షర్ట్‌ను ఆవిష్కరించారు. లోగో ఆవిష్కరణ అనంతరం శ్రీనందు తనదైన శైలిలో కస్టమర్లతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడారు. 200లకు పైగా బ్రాండ్లు ఈ మెగా సేల్‌లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫుడ్ కోర్టులో సైతం స్పెషల్ ఆఫర్లు పొందొచ్చని, మాల్‌లోని ఇతర రిటైల్ స్టోర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయని తెలిపారు. లులు గ్రాండ్ షాపింగ్ కార్నివాల్ కాంటెస్ట్‌లో 'లులు హ్యాపీనెస్ రిజిస్టర్డ్ కస్టమర్లు కనీసం రూ.2999 షాపింగ్ చేసిన వాళ్లు లక్కీ డ్రా ద్వారా హ్యుందాయ్ ఐ20 కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. లులు హైపర్ మార్కెట్‌లో గ్రాసరీస్, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు తదితర 25 వేలకు పైగా వస్తువులపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. అటు గేమ్స్ జోన్ ఫంటురాలో ప్రత్యేకంగా 100 శాతం బోనస్ సెలబ్రేషన్ ఆఫర్‌ను అందిస్తున్నారు. రూ.2000 లేదా అంతకంటే ఎక్కువ రీఛార్జ్ చేసుకుంటే, ఆ అమౌంట్ రెట్టింపు అవుతుందన్నారు. దీంతోపాటు కస్టమర్లకు ఉచితంగా రైడ్ కూపన్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. లులు హ్యాపినెస్ లాయల్టీ కస్టమర్లకు 8వ తేదీ నుంచే సేల్ యాక్సెస్ ఉంటుందని చెప్పారు. ఈ నాలుగు రోజులూ ఉదయం 9 గంటల నుంచే స్టోర్ తెరిచి ఉంటుందని తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం అదనపు పార్కింగ్, ఇతర వసతులు సహా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఏజిల్ అరసన్, డీజీఎం విశాల్ కుమార్, ఫంటురా అసిస్టెంట్ మేనేజర్ సూర్యకాంత్, మార్కెటింగ్ మేనేజర్లు ఫణి, మను ఆంథోనీ పాల్గొన్నారు.



# విజయ్ సేతుపతి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్న

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'సినిమాలో హిట్ అందుకొని అదే జోష్ కొనసాగిస్తూ వరుస చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటూ దూసుకుపోతున్నారు. త్వరలోనే 'ఓ సుకుమారి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తిరువీర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఒక చక్కటి రూరల్ రొమాంటిక్ కామెడీ, ఫాంటసీ డ్రామాగా రాబోతుండగా.. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం ఈ చిత్ర యూనిట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా ముగించే పనిలో బిజీగా ఉంది. జూలై 17న థియేటర్స్‌లోకి రాబోతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ.. తనకు కేవలం 22 ఏళ్ల వయసు ఉన్నప్పుడే ఒక సినిమాలో ఇద్దరు పిల్లల తల్లి పాత్రలో నటించానని ఐశ్వర్య రాజేష్ వెల్లడించారు. ఆ చిత్రం మరేదో కాదు.. విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో, విరుమాండి దర్శకత్వంలో కేజెఆర్ స్టూడియోస్ బ్యానర్‌పై వచ్చిన 'కా పే రణసింగం'. ఆ సమయంలో అంత చిన్న వయసులో తల్లి పాత్ర చేయడం పెద్ద సాహసమే అయినప్పటికీ, ఆ రోల్ చేయడానికి స్టార్ హీరో విజయ్ సేతుపతి గారే తనను ఎంతగానో ప్రోత్సహించారని ఆమె తెలిపారు. అప్పట్లో ఆ పాత్రను తాను చేయగలనని విజయ్ సేతుపతి తనపై ఎంతో నమ్మకం ఉంచారని ఐశ్వర్య పేర్కొన్నారు. నిజానికి ఆ సమయంలో తాను గొప్ప నటిని ఏమీ కాదని, ఆ క్యారెక్టర్‌లో ఎలా లీనమవ్వాలి, ఎలా నటించాలి అనే విషయాలను విజయ్ సేతుపతి దగ్గరుండి మరీ నేర్పించారని ఆమె కృతజ్ఞతతో గుర్తుచేసుకున్నారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు. దాదాపు ఆరేళ్ల క్రితం విడుదలైన ఈ సినిమా విశేషాలను, నాటి షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ ఐశ్వర్య రాజేష్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# 10న విడుదలవుతున్న లెనిన్

## ఓటిటి హక్కులు దక్కించుకున్న జీ

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.




# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్

## ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉ ండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ



మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.




# నిర్మాతగా ప్రదీప్ రంగనాథ్ కొత్త అవతారం

వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథ్ ఇప్పుడు నిర్మాతగా అవతారం ఎత్తబోతు న్నారు. లవ్ టుడే, డ్రాగన్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన సినిమాతో మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ సినిమా నిరాశపరిచినప్పటికీ ప్రదీప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నటుడు, దర్శకుడు, కథా రచయిత, గేయ రచయితగా తన ప్రతిభను చాటుకున్న ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు నిర్మాతగానూ అడుగుపెడుతున్నారు. తాజాగా పీఆర్ షో అనే సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆయన, ఆ బ్యానర్‌పై తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం లో 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. దర్శకుడిగా పేరు తెచ్చుకుని, ప్రస్తుతం నటుడిగానూ రాణిస్తున్న అశ్వత్ మారిముత్తు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాతో అనామిక మహి వెండితెరకు పరిచయం కానుండగా, తెలుగు నటుడు శివాజీ సొంటినేని, నటి స్వాసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ 'ది ఆల్ఫా యూనిట్'. ఆరుగురు యువ దర్శకులతో ఫిల్మ్‌మేకింగ్ చేయడం. విశాల్ టీఆర్, యశ్ వి, నరేన్ సౌదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించనున్నారు. ఈ వినూత్న ప్రయత్నం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కథను స్వయంగా ప్రదీప్ రంగనాథన్ అందించగా, యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమా ప్రకటన సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో నటీనటులు, సాంకేతిక బృందాన్ని పరిచయం చేస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు. నిర్మాతగా ప్రదీప్ రంగనాథన్ ప్రారంభిస్తున్న ఈ కొత్త ప్రయాణం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# ఇరుముడితో బిజీ అయినా కొత్త సినిమాపై రవితేజ దృష్టి



మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మ-రోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# నాగార్జున వందో సినిమాలో టబూ

టాలీవుడ్

కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com